సాక్షి అనంతపురం

గురువారం । 20 । జూలై । 2023



రైతులకు విస్తృత ప్రయోజనాలు

ఖరీఫ్‌లో రైతులకు విస్తృత ప్రయోజనాలు చేకూర్చాలని జెడ్పీ స్థాయీ సంఘం సభ్యులు అధికారులను కోరారు. 8లో



టీబీ డ్యాంలో 11 టీఎంసీలు

టీబీ డ్యాంలో బుధవారం నాటికి 11.774 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో 9,849, అవుట్ ఫ్లో 259 క్యూసెక్కులుగా ఉంది.

గరిష్టం/కనిష్టం
31.4°/21.6°

జిల్లా అంతటా బుధవారం తుపాను వాతావరణం నెలకొంది. పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలిక పాటి వర్షపాతం నమోదైంది.

న్యూస్‌రీల్

గార్లదిన్నె పోలీస్‌స్టేషన్ పరిశీలన



స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న కేంద్ర బృంద సభ్యుడు బాలచంద్ర

గార్లదిన్నె: 'క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా' కేంద్ర బృంద సభ్యుడు బాలచంద్ర బుధవారం గార్లదిన్నె పోలీస్ స్టేషన్‌ను పరిశీలించారు. స్టేషన్‌లో రికార్డులు ఏ విధంగా భద్రపరుస్తున్నారో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిసరాలు, పరిశుభ్రత, మౌలిక వసతులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉత్తమ పోలీస్‌స్టేషన్ల గుర్తింపు, జాతీయస్థాయి ర్యాంకింగ్ ప్రకటన కోసం తాము దేశమంతా పర్యటిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటశివారెడ్డి, సీఐ అస్రార్ బాషా, ఎస్‌ఐ సాగర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తనిధి తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని రక్తనిధి కేంద్రాన్ని (బ్లడ్ బ్యాంకు) సెంట్రల్ డ్రగ్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సీడీఎస్‌సీఓ) అసిస్టెంట్ డ్రగ్ కంట్రోలర్ (ఏడీసీ) కిషోర్ డొండిల్కర్ బుధవారం తనిఖీ చేశారు. రక్తనిధి లైసెన్స్ గతేడాది డిసెంబర్‌కు ముగిసింది. అప్పటికే ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్, పెథాలజీ విభాగం రెన్యూవల్‌కు దరఖాస్తు చేశారు. ఈ క్రమంలో ఏడీసీ కిషోర్ డొండిల్కర్, అనంతపురం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ హనుమన్న రక్తనిధి కేంద్రాన్ని బుధవారం తనిఖీ చేశారు. ఎంత రక్తాన్ని రోగులకందిస్తున్నారు, ఎంత సేకరిస్తున్నారన్న వాటికి సంబంధించి రిజిష్టర్లను పరిశీలించారు. గురువారం మరోసారి సీడీఎస్‌సీఓ బృందం తనిఖీ చేయనుంది. కార్యక్రమంలో ప్రొఫెసర్ శివశంకర్ నాయక్, పెథాలజిస్టు కృష్ణచైతన్య ఉన్నారు.

చేప పిల్లల ఉత్పత్తి ప్రారంభం



తల్లి చేపలకు ఇంజెక్షన్ వేస్తున్న ఎఫ్‌డీఓ

అనంతపురం అగ్రికల్చర్: మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేపపిల్లల ఉత్పత్తి మొదలైంది. బుధవారం స్థానిక మత్స్య క్షేత్రంలో తల్లిచేపలకు ఇంజెక్షన్లు వేసి గుడ్లు పొదిగించే కార్యక్రమం ప్రారంభించారు. ఈ ఏడాది 8 కోట్ల చేప పిల్లల ఉత్పత్తి లక్ష్యంగా బ్రీడింగ్ చేపట్టినట్లు మత్స్యశాఖ డీడీ డాక్టర్ కె.శాంతి తెలిపారు. అనంతపురం, పెనకచెర్ల మత్స్య క్షేత్రాల్లో చేప పిల్లల ఉత్పత్తి చేపట్టిన తర్వాత అనంతపురం, పెనకచెర్లతో పాటు బీటీపీ, పీఏబీఆర్ క్షేత్రాల్లో పెంపకం ఉంటుందన్నారు. కనీసం మూడు నెలల వయసున్న కట్ల, రోహు, మృగాల, బంగారుతీగ రకాలకు చెందిన 1.33 కోట్ల చేపపిల్లలు అందుబాటులోకి తీసుకు రావాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు తెలిపారు. అధీకృత రిజర్వాయర్లుగా ఉన్న శ్రీసత్యసాయి జిల్లా పరిధిలోని అప్పర్ పెన్నార్ ప్రాజెక్టు (పేరూరు డ్యాం)తో పాటు అనంతపురం జిల్లాలోని ఎంపీఆర్, బీటీ ప్రాజెక్టుల్లోకి ఉచితంగా చేప పిల్లలు వదులుతామన్నారు. లీజు పద్ధతిన పీఏబీఆర్‌కు ఇస్తామన్నారు. ఇక మిగిలినవి మత్స్యకార సహకార సంఘాలు, పెంపకానికి ముందుకు వచ్చే వారికి ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద 40 శాతం, ఎస్సీ–ఎస్టీ లబ్ధిదారులకు 60 శాతం రాయితీతో పంపిణీ చేస్తామన్నారు.


ముగిసిన దరఖాస్తుల స్వీకరణ



అనంతపురం సెంట్రల్: జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి సంబంధించి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ బుధవారం ముగిసింది. మూడు అంగన్‌వాడీ వర్కర్ పోస్టులకు 17 మంది, 36 హెల్పర్ పోస్టులకు 106 మంది మహిళలు దరఖాస్తు చేసుకున్నారు. ఒక మినీ అంగన్‌వాడీ పోస్టుకు నోటిఫికేషన్ వెలువడగా ఎవరూ దరఖాస్తు చేసుకోలేదు. అర్హులైన అభ్యర్థులకు ఈ నెల 22న అనంతపురం ఆర్డీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు.

చెంతనే మెరుగైన వైద్యం

ప్రజలకు చెంతనే మెరుగైన వైద్యం అందుబాటులోకి వచ్చింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగానికి పెద్దపీట వేశారు. ప్రభుత్వాస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు కల్పించి, వైద్యులు, సిబ్బందిని అందుబాటులో ఉంచి సకాలంలో మెరుగైన వైద్యం అందేలా చూస్తున్నారు. ప్రజలు ఎటువంటి చికిత్సకైనా వెంటనే సమీపంలోని వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు.



అనంతపురంలోని కోర్టు రోడ్డులో ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం

ప్రజారోగ్యానికి పెద్దపీట

- వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల ద్వారా సేవలు
- జ్వరం నుంచి పాముకాటు వరకు అన్నింటికీ చికిత్సలు
- 64 రకాల రక్త పరీక్షలతో పాటు అందుబాటులో 172 రకాల మందులు



రక్త పరీక్షలు చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్

అనంతపురం క్రైం: డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నాణ్యమైన, మెరుగైన వైద్యం అందుబాటులోకి వచ్చింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో 25 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. సాధారణ జ్వరం, దగ్గు, జలుబు మొదలు కొని క్షతగాత్రులకు డ్రెస్సింగ్ నుంచి దోమకాటు వ్యాధులు, గర్భిణులకు సేవలు, కుక్క, తేలు, పాము కాటు చికిత్సలు అందించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో మౌలిక సదుపాయాలు మెరుగుపరిచారు. వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించడానికి రూ.లక్షల విలువ చేసే అనలైజర్ మిషన్లు, ఈసీజీ, సెక్షన్ ఆపరేటర్లు, ప్రసవాలు చేసేందుకు టేబుళ్లు తదితర వాటిని అందుబాటులో ఉంచారు.

పట్టణ ఆరోగ్య కేంద్రాలివే..

అనంతపురంలోని ఆదిమూర్తినగర్, అంబేడ్కర్‌నగర్, హమాలీకాలనీ, మంగళవారికాలనీ, నాయక్‌నగర్, నీరుగంటి వీధి, రెండో రోడ్డు, శ్రీనివాసనగర్, వినాయకనగర్, ఇందిరాగాంధీనగర్లో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటయ్యాయి. గుత్తిలో జగనన్న కాలనీ (బీసీ కాలనీ), చెట్నేపల్లి, గుంతకల్లులో అంబేడ్కర్‌నగర్, భాగ్యనగర్, సత్యనారాయణపేట, తిలక్ నగర్లో కేంద్రాలు నిర్వహిస్తున్నారు. కళ్యాణదుర్గంలో ఇందిరమ్మ కాలనీ, ఒంటిమిద్ది, రాయదుర్గంలో కణేకల్లు రోడ్డు ప్రాంతం, రాజీవ్‌గాంధీకాలనీ, శాంతినగర్, తాడిపత్రిలో అంబేడ్కర్‌నగర్, పాత కోట, శ్రీనివాసపురం, టైలర్స్ కాలనీలో ఆరోగ్య కేంద్రాలున్నాయి.

వ్యయప్రయాసలు తగ్గాయ్..

ఇదివరకు ఏదైనా చిన్నపాటి ఆరోగ్య సమస్య వస్తే చాలు జిల్లా కేంద్రంలోని సర్వజనాస్పత్రికి ప్రజలు పరుగులు తీసేవారు. అక్కడ ఓపీ చీటీ తీసుకోవడం నుంచి వైద్య సేవలు పొందే వరకు అధికసమయం వేచి చూడాల్సి వచ్చేది. అటువంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సేవలను విస్తృతం చేసింది. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేసే ఈ ఆరోగ్య కేంద్రాల్లో రోజూ ఓపీ సంఖ్య 40 నుంచి 50 వరకు ఉంటోంది. 15 నుంచి 30 మందికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. వయసు పైబడిన వారు, దీర్ఘకాలిక జబ్బులతో బాధపడేవారి వైద్య సేవల కోసం ఈ ఆస్పత్రులు బాగా ఉపయోగపడుతున్నాయి. డీహైడ్రేషన్‌కు గురైన వారికి సైతం సెలైన్లు ఎక్కించి, మెరుగైన వైద్యం అందిస్తున్నారు. వ్యయప్రయాసలు, ఎదురుచూపులు తగ్గి సమీపంలోనే వైద్య సేవలు అందుతుండటంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

64 రకాల పరీక్షలు, 172 రకాల మందులు

పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ)లో సీరమ్ ఎలక్ట్రోలైజర్, సీబీపీ, బయోకెమిస్ట్రీ అనలైజర్, సెంట్రీఫ్యూజర్ మిషన్లు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో పరికరం ధర రూ.లక్ష వరకు ఉంటుంది. సోడియం, పొటాషియం, ఆర్‌బీసీ, డబ్ల్యూబీసీ, ప్లేట్‌లెట్స్, కంప్లీట్ బ్లడ్ పిక్చర్, కొలెస్ట్రాల్, బ్లడ్ యూరియా, సీరమ్ క్రియాటినిన్, హెచ్‌బీ, తదితర 64 రకాల రక్త పరీక్షలు చేస్తారు. వీటితో పాటు డెంగీ, మలేరియా ర్యాపిడ్ కిట్ పద్ధతి ద్వారా పరీక్షలు చేస్తారు. గ్లూకోమీటర్ ద్వారా మధుమేహ పరీక్షలు చేస్తున్నారు. గుండెకు సంబంధించి ఈసీజీ పరీక్ష, చిన్నారులకు నెబులైజేషన్ పరికరం అందుబాటులో ఉన్నాయి. అలాగే 172 రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. బీపీ, డయాబెటిస్ వ్యాధిగ్రస్తులకు ఇన్సులిన్, గ్యాస్ట్రిక్ తదితర మందులు ఉన్నాయి. ముఖ్యంగా పాము కాటుకు యాంటీ స్నేక్ వీనమ్, కుక్క కాటుకు యాంటీ రేబిస్ వీనమ్ సిద్ధంగా ఉంచారు.

సద్వినియోగం చేసుకోవాలి

పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వైద్యులు, ఫార్మసిస్టులు, స్టాఫ్‌నర్సులు, నాల్గో తరగతి ఉద్యోగులు అందుబాటులో ఉంటారు. పట్టణ ప్రాంత ప్రజలు సమీప ప్రాంతాల్లో ఉన్న కేంద్రాల్లో వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి. క్లిష్టమైనవి తప్ప మిగతా అన్ని రకాల అనారోగ్యాలు, జబ్బులకు వైద్య సేవలందుతాయి.

– డాక్టర్ చెన్నకేశవులు, ఎన్‌హెచ్‌ఎం ప్రోగ్రాం ఆఫీసర్

బుధవారం టీకాలు

యూపీహెచ్‌సీల్లో ప్రతి బుధవారం గర్భిణులు, చిన్నారులకు టీకాలు వేస్తారు. ప్రతి శనివారం అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆశా వర్కర్ల ద్వారా టీకాలందిస్తారు.

మారిన ఆస్పత్రుల రూపురేఖలు

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగానికి పెద్దపీట వేశారు. అత్యాధునిక భవనాలు, మౌలిక సదుపాయాల కోసం రూ.కోట్లు వెచ్చించి వాటి రూపురేఖలను మార్చేశారు. కార్పొరేట్ హంగులతో ఆస్పత్రులను తీర్చిదిద్దారు. జిల్లాలోని 25 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు గాను 17 కేంద్రాలకు పక్కా భవనాలు మంజూరయ్యాయి. ఇందులో ఆరు భవనాలు పూర్తవగా, మరో 11 నిర్మాణ దశలో ఉన్నాయి. మిగతా 8 భవనాలు ఇది వరకే ఉన్నాయి.



మందులు పంపిణీ చేస్తున్న ఫార్మసిస్టు



రోగిని పరీక్షిస్తున్న యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తేజస్విని



కాలుకు డ్రెస్సింగ్ చేస్తున్న సిబ్బంది

కొనసాగుతున్న తేలికపాటి వర్షాలు



అనంతపురం అగ్రికల్చర్: జిల్లా అంతటా తేలికపాటి వర్షాలు కొనసాగుతున్నాయి. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు 21 మండలాల పరిధిలో 3 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. అనంతపురం 14.6 మి.మీ, డి.హీరేహాళ్ 13 మి.మీ, కళ్యాణదుర్గం 10.2మి.మీతో పాటు నార్పల, బొమ్మనహాళ్, కూడేరు, గుత్తి, బుక్కరాయసముద్రం, ఉరవకొండ, బెళుగుప్ప, గుంతకల్లు, బ్రహ్మసముద్రం, శింగనమల, పెద్దవడుగూరు, కంబదూరు, రాయదుర్గం తదితర మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. జూలై నెల సాధారణ వర్షపాతం 63.9 మి.మీ కాగా నైరుతి రుతుపవనాలు ప్రభావం చూపకపోవడం, గాలివేగం పెరగడంతో ఇప్పటి వరకు 26.1 మి.మీ నమోదైంది. 9 మండలాల్లో సాధారణం కాగా.. మిగతా 22 మండలాల్లో తక్కువగా వర్షాలు కురిశాయి. గత జూన్ 1 నుంచి ఇప్పటి వరకు 11 వర్షపు రోజులు (రెయినీడేస్) నమోదు కావడంతో అరకొర వర్షాలకే ఖరీఫ్ కొనసాగుతోంది. జిల్లా అంతటా ఒక్క పదును వర్షం పడితే ఏరువాక జోరందుకోనుంది. కాగా రాగల రెండు రోజులు జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.అశోక్‌కుమార్ బుధవారం విడుదల చేసిన వాతావరణ బులెటిన్‌లో తెలిపారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి అనుమతి

అనంతపురం: యూనివర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ అనుమతి ఇచ్చింది. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో 117 పోస్టులు, జేఎన్‌టీయూ అనంతపురంలో 89 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. నాలుగు రోజుల కిందట ఎస్కేయూ, జేఎన్‌టీయూ అనంతపురంలో పాలకమండళ్ల సమావేశం నిర్వహించారు. ఇందులో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల ఖాళీలకు సంబంధించిన జాబితాకు ఆమోదం తీసుకున్నారు. రేషనలైజేషన్, ఏయే విభాగాల్లో ఎన్ని పోస్టులు ఖాళీగా ఉన్నాయి అనే అంశంపై స్పష్టత వచ్చాకే పాలకమండలి ఆమోదం తీసుకుని జాబితాను రాష్ట్ర ప్రభుత్వానికి పంపారు. గతంలో 2017, 2018 సంవత్సరాల్లో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్లను హైకోర్టు రద్దు చేసింది. అపుడు ఏర్పడిన న్యాయపరమైన అవరోధాలు తొలగిపోయాయి. దీంతో కొత్త నోటిఫికేషన్‌కు మార్గం సుగమమైంది. అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు సంబంధించి విభాగాల వారీగా రోస్టర్ పాయింట్లను నిర్ధారించారు. త్వరలోనే అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయనున్నారు.

ఆర్టీసీలో హర్షాతిరేకాలు

- 'అధిక పింఛన్'తో ఉద్యోగుల సంబరాలు
- ముఖ్యమంత్రి జగన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4,500 మందికి లబ్ధి



గుత్తిలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

అనంతపురం సెంట్రల్: ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగుల సంబరాలు మిన్నంటాయి. అధిక పింఛన్ (హయ్యర్ పెన్షన్) నమోదుకు ప్రభుత్వం అవకాశం కల్పించడంతో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ మేరకు బుధవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ ఉద్యోగులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. సీఎం జగన్ మొదట్నుంచీ ఏపీఎస్‌ఆర్టీసీ ఉద్యోగులకు వరాల జల్లు కురిపిస్తున్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి చరిత్రలో నిలిచిపోయారు. 2016 నుంచి ఆగిపోయిన కారుణ్య నియామకాలను కొనసాగించి బాధిత కుటుంబాలకు అండగా నిలిచారు. తాజాగా దేశంలోని ఏ రాష్ట్రంలోనూ చేయని విధంగా అధిక పింఛన్ నమోదుకు అవకాశం కల్పించారు. దీనివల్ల ఉమ్మడి జిల్లాలో దాదాపు 4,500 మంది ఆర్టీసీ ఉద్యోగులకు లబ్ధి కలగనుంది. ఇందులో అనంతపురం జిల్లాలో సుమారు 2,300, శ్రీసత్యసాయి జిల్లాలో 2,200 మంది ఉద్యోగులు ఉన్నారు.

పదింతల పెన్షన్

రెండు రోజుల క్రితం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ స్థాయి అధికారి పదవీవిరమణ పొందగా ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్‌ఓ) ద్వారా రూ.80 వేల పింఛన్ వర్తించింది. గతంలో రూ.8 వేల నుంచి రూ.10 వేలు మాత్రమే పింఛన్ వచ్చేదని అధికారులు తెలిపారు. అలాగే రెండేళ్ల తర్వాత జూనియర్ అసిస్టెంట్ కేడర్ (కండక్టర్) ఉద్యోగులు పదవీ విరమణ పొందితే రూ.25 వేలు, ఆపైన పింఛన్ వస్తుందని పేర్కొన్నారు. సీపీఎస్ కన్నా పదింతలు, ఓల్డ్ పెన్షన్ స్కీము (ఓపీఎస్) కన్నా మేలైన పింఛన్ విధానాన్ని ఆర్టీసీ ఉద్యోగులకు తీసుకొచ్చారని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఆర్టీసీలో కారుణ్య నియామకాలను 2016 నుంచి అప్పటి టీడీపీ ప్రభుత్వం నిలుపుదల చేసింది. కానీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే మళ్లీ కొనసాగిస్తూ ఉత్తర్వులిచ్చింది. దీనివల్ల ఉమ్మడి జిల్లాలో ఆర్టీసీకి సంబంధించి ఇప్పటికే 33 మంది ఇతర శాఖల్లో, మరో 45 మంది ఆర్టీసీలోనే ఉద్యోగాలు పొందారు.

ఆర్టీసీ ఉద్యోగులకు వరం

రాష్ట్ర ప్రభుత్వ చొరవతో అధిక పింఛన్ నమోదుకు అవకాశం లభించింది. ఆర్టీసీ ఉద్యోగులందరూ ఇందుకు అర్హులు. దీనివల్ల గతంలో కన్నా పదింతల పెన్షన్ వస్తుంది. ఇది ఆర్టీసీ ఉద్యోగులకు నిజంగా వరం.

– రమేష్‌బాబు, ఇన్‌చార్జ్ ఆర్‌ఎం



రూ.50కే కిలో టమాట

- రైతు బజారులో ప్రత్యేక కౌంటర్
- ఒక్కొక్కరికి కిలో చొప్పున అమ్మకాలు
- ధరలు తగ్గుముఖం పట్టే వరకు కొనసాగింపు
- తక్కువ ధరకే మసూరి బియ్యం, కందిబేడలు

అనంతపురం అగ్రికల్చర్: మార్కెట్లో టమాట ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కిలో వంద రూపాయలు దాటేశాయి. సామాన్యులు కొనలేని పరిస్థితి నెలకొంది. ప్రజల ఇబ్బందులను గమనించిన రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై టమాట అందించాలని నిర్ణయించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు అనంతపురం రైతు బజార్‌లో కిలో టమాట రూ.50కే అందిస్తున్నారు. ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. ఈ కౌంటర్‌ను బుధవారం మార్కెటింగ్‌శాఖ ఏడీ పి.సత్యనారాయణచౌదరి ప్రారంభించారు. రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విక్రయాలు ఉంటాయన్నారు. ధరలు తగ్గుముఖం పట్టేవరకు అమ్మకాలు కొనసాగిస్తామన్నారు. ప్రతి ఒక్కరికీ కిలో చొప్పున టమాటాలు విక్రయిస్తామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కక్కలపల్లి మండీలోనే రైతుల నుంచి కిలో టమాట రూ.90 ప్రకారం కొనుగోలు చేసి, సబ్సిడీపై రూ.50కి అందిస్తున్నట్లు రాప్తాడు మార్కెట్ కమిటీ కార్యదర్శి రామ్‌ప్రసాద్ తెలిపారు. అలాగే పౌరసరఫరాల శాఖ, ట్రేడర్లు, మిల్లర్ల సహకారంతో నాణ్యమైన సోనా మసూరీ బియ్యం కిలో రూ.48, మేలు రకం కంది బేడలు కిలో రూ.130 ప్రకారం విక్రయించేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు రైతుబజార్ ఎస్టేట్ అధికారి ప్రతాప్‌రుద్ర తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

● లాలిజో.. పాపాయి..



పామిడికి చెందిన రాజు, నందిని దంపతులు బతుకుదెరువు కోసం అనంతపురంలో ఆటోలో నేరేడు పండ్లు విక్రయిస్తున్నారు. తమ చంటిబిడ్డను సైతం వెంట తీసుకొచ్చారు. ఆటో ముందుకు కదులుతుండగా చల్లటి గాలికి బిడ్డ నిద్రలోకి జారుకుంది. తల్లి ఆటోలోనే చీరతో ఊయల కట్టి బిడ్డను నిద్రపుచ్చింది. ఓ వైపు బిడ్డను ఊయలూపుతూ.. మరోవైపు వ్యాపారం చేస్తూ ముందుకు సాగారు. ఈ దృశ్యాన్ని బుధవారం జెడ్పీ కార్యాలయం వద్ద 'సాక్షి' కెమెరాలో బంధించింది. – జి.వీరేష్, సాక్షి ఫొటోగ్రాఫర్

● వైభవంగా కుళ్లాయిస్వామి ప్రథమ దర్శనం

నార్పల: హిందూ, ముస్లింల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తున్న గూగూడు కుళ్లాయి స్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. కుళ్లాయిస్వామి పీరు ప్రథమ దర్శనం అంగరంగ వైభవంగా జరిగింది. మొదటగా తిరుమల కొండన్న వంశీయులు స్వామి పీరును భద్రపరచిన పెట్టెను కిందకు దింపారు. పీరును సుగంధ ద్రవ్యాలతో శుభ్రం చేశారు. అనంతరం కుళ్లాయిస్వామి ప్రతిమకు, అగ్ని గుండానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొబ్బరి దివిటీల వెలుగులో, సన్నాయి వాయిద్యాల నడుమ పట్టు వస్త్రాలు, బంగారు గొలుసుల అలంకరణలో భక్తులకు కుళ్లాయిస్వామి పీరు దర్శన భాగ్యం కల్పించారు. వివిధప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అనేకమంది ఇళ్లపై నుంచి ప్రథమ దర్శనాన్ని తిలకించారు.

పీరును చూపుతున్న కొండన్న వంశీయులు



క్లుప్తంగా

వివాహిత బలవన్మరణం



రామలక్ష్మమ్మ (ఫైల్)

కళ్యాణదుర్గం: జీవితంపై విరక్తితో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... కళ్యాణదుర్గం మున్సిపల్ పరిధిలోని శంకరప్ప తోట ప్రాంతానికి చెందిన కిష్టప్ప, రామలక్ష్మమ్మ (57) దంపతులు. కడుపుపై గడ్డ ఏర్పడడంతో రెండు నెలలుగా రామలక్ష్మమ్మ తీవ్ర ఇబ్బందులు పడుతూ వస్తోంది. ఈ క్రమంలో కుటుంబసభ్యులు పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించారు. నయం కాక పోవడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆమె బుధవారం తెల్లవారుజామున ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటపడింది. కంబదూరు రోడ్డులోని వెంకటేశులు పొలానికి చేరుకుని అక్కడున్న పాడుబడిన బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఉదయం అటుగా వెళ్లిన వారు బావిలో తేలుతున్న రామలక్ష్మమ్మ మృతదేహాన్ని గుర్తించి సమాచారమివ్వడంతో కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని వెలికి తీశారు. పట్టణ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కిష్టప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మట్కా బీటర్ల అరెస్ట్

గుంతకల్లు రూరల్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆన్‌లైన్ ద్వారా మట్కా నిర్వహిస్తున్న ఏడుగురు బీటర్లను అరెస్ట్ చేసినట్లు రూరల్ సీఐ ఉమామహేశ్వరరెడ్డి తెలిపారు. వివరాలను బుధవారం ఆయన స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. కొంత కాలంగా ఆన్‌లైన్ మట్కా జోరుగా సాగుతున్నట్లు సమాచారం అందుకున్న ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసులు ప్రత్యేక నిఘా పటిష్టం చేశారు. ఈ క్రమంలో కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరి నివాసి మీసాల రాముడు, ఆయన కుమారుడు మీసాల సుదర్శన్, గుంతకల్లులోని దోనిముక్కల రోడ్డుకు చెందిన బోయ ఈశ్వరయ్య, ఎస్కేపీ కళాశాల వద్ద నివాసముంటున్న ఉల్లిగడ్డల శంకర్‌కుమార్, దూదేకుల మహబూబ్ బాషా బుధవారం ఉదయం ఎస్కేపీ కళాశాల వద్ద ఆన్‌లైన్ మట్కా నిర్వహిస్తూ పట్టుబడ్డారు. వీరి నుంచి రూ.1,62,300 నగదు స్వాధీనం చేసుకున్నారు. అలాగే కసాపురం రోడ్డులోని మారుతీ నగర్‌లో కర్నూలు జిల్లా చిప్పగిరి మండలం నంచర్ల నివాసి దొండ నరేష్, గుంతకల్లు మండలం దోసలుడుకి నివాసి రాజశేఖర్ ఆన్‌లైన్ మట్కా నిర్వహిస్తూ కసాపురం ఎస్‌ఐ గోపాలుడుకి పట్టుబడ్డారు. వీరి నుంచి రూ.1,00,110 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఏడుగురు బీటర్లపై కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. బీటర్ల అరెస్ట్‌లో చొరవ చూపిన గుంతకల్లు రూరల్ ఎస్‌ఐ సురేష్, కసాపురం ఎస్‌ఐ గోపాలుడు, హెడ్‌కానిస్టేబుల్ రాముడు, కానిస్టేబుల్ వీరనారాయణ, రఘుకుమార్, వేమన్న, వెంకటేష్, భూపతి, హరిప్రసాద్, సుంకన్న తదితరులను అభినందించారు.

గుర్తు తెలియని యువకుడి ఆత్మహత్య



గుత్తి: స్థానిక జీఆర్పీ పరిధిలోని తురకపల్లి రోడ్డు సమీపంలో బుధవారం ఉదయం రైలు కింద పడి ఓ గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు గుత్తి జీఆర్పీ ఎస్‌ఐ నాగప్ప, కానిస్టేబుల్ వాసు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు గుత్తి రైల్వే పోలీసులను స్పందించాలని కోరారు

రైతులకు విస్తృత ప్రయోజనాలు

- జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాల్లో సభ్యులు
- గురుకులాల్లో సీట్లు అమ్ముకోవడంపై ఆగ్రహం



మాట్లాడుతున్న గుమ్మఘట్ట జెడ్పీటీసీ సభ్యుడు మహేష్

అనంతపురం సిటీ: ఖరీఫ్ సీజన్ కావడంతో రైతులకు విస్తృత ప్రయోజనాలు కలిగే అంశాలపై దృష్టి పెట్టాలని వ్యవసాయ శాఖ అధికారులను జెడ్పీ స్థాయీ సంఘం సభ్యులు కోరారు. జెడ్పీ స్థాయీ సంఘాలు-1, 2, 4, 7(ప్రణాళిక, ఆర్థిక/గ్రామీణాభివృద్ధి/విద్య, వైద్యం/ఇంజినీరింగ్ శాఖల) సమావేశాలు జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ అధ్యక్షతన స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయ ప్రధాన సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించారు. స్థాయీ సంఘం-3(వ్యవసాయ, అనుబంధ శాఖలు) సమావేశం జెడ్పీ వైస్ చైర్మన్ తాడిమర్రి సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన జరగ్గా, స్థాయీ సంఘం-5 సమావేశం ఆ విభాగం చైర్‌పర్సన్ హెచ్.హసీనా బాను(డి.హీరేహాళ్ జెడ్పీటీసీ) అధ్యక్షతన నిర్వహించారు. స్థాయీ సంఘం-6(సాంఘిక సంక్షేమ శాఖలు) సమావేశం జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ వి.నాగరత్నమ్మ(జెడ్పీటీసీ-నార్పల) అధ్యక్షతన కొనసాగాయి. సీఈఓ భాస్కర్‌రెడ్డి, ఏఓ తిప్పయ్య, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.

వ్యవసాయ శాఖపై చర్చ సందర్భంగా పరిగి జెడ్పీటీసీ రామప్ప మాట్లాడుతూ.. టీడీపీ హయాంలో ఇచ్చిన రెయిన్‌గన్లు, స్ప్రింక్లర్లు, ఇతర వ్యవసాయ పరికరాలను స్వాధీనం చేసుకుని వాటిని రైతులకు అందజేయాలని కోరారు. వర్షాభావ పరిస్థితులు వెంటాడుతున్నాయని, సకాలంలో వేరుశనగ విత్తనం వేయలేకపోతున్నారని, ప్రత్యామ్నాయ పంటల గురించి రైతులకు వివరించి, ఆ దిశగా వారిని ప్రోత్సహించాలని సభ్యులు కోరారు. ఆగస్టు 5 వరకు విత్తనాలు విత్తుకోవచ్చని, లేదంటే ప్రత్యామ్నాయ పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారిణి ఉమామహేశ్వరమ్మ తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టనున్న పనులకు సంబంధించి ఎస్టిమేషన్లు తయారు చేసి ఇవ్వాలని ఆ శాఖ ఎస్‌ఈ గోపాల్‌రెడ్డిని కోరినా పట్టించుకోవడం లేదని, ఇంత నిర్లక్ష్యమైతే ఎలాగని లేపాక్షి జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి ప్రశ్నించారు. కొన్ని పంచాయతీల్లో కార్యదర్శులు భారీగా అక్రమాలకు పాల్పడుతున్నారని, అటువంటి వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని డీపీఓ ప్రభాకర్‌రావును సభ్యులు కోరారు.

- అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ అధ్వానంగా మారడంపై ఐసీడీఎస్ విభాగం చైర్‌పర్సన్ హసీనా, జెడ్పీటీసీ సభ్యులు కవిత(అమడగూరు), మమత(బెళుగుప్ప), చంద్ర(అనంతపురం రూరల్) ఆగ్రహం వ్యక్తం చేశారు. చాలీ చాలని అద్దె భవనాల్లో కేంద్రాలు నిర్వహిస్తుండడంతో పిల్లలు అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని రెండు జిల్లాల పీడీలు లక్ష్మీకుమారి, శ్రీదేవిని కోరారు. నిర్మాణాలు పూర్తయిన అంగన్‌వాడీ భవనాలను తక్షణం స్వాధీనం చేయాలని యల్లనూరు జెడ్పీటీసీ విజయప్రతాపరెడ్డి కోరారు.
- డ్వాక్రా సంఘాల సొమ్మును కొందరు మింగేస్తున్నారని బుక్కరాయసముద్రం జెడ్పీటీసీ భాస్కర్ ఆరోపించారు. ఆధారాలతో సహా ఏపీఎంకు ఫిర్యాదు చేసినా కనీస స్పందన లేదని మండిపడ్డారు.
- గ్రామాల్లో వ్యవసాయం కోసం ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే వాటిని మార్చేందుకు రైతుల నుంచి ట్రాన్స్‌కో సిబ్బంది రూ.50 వేల వరకు అక్రమంగా వసూలు చేస్తున్నారని గుమ్మఘట్ట జెడ్పీటీసీ మహేష్ ఆరోపించారు. అటువంటి వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

గురుకులాల్లో సీట్లు అమ్ముకుంటారా?

విద్యా శాఖకు సంబంధించిన అంశంపై చర్చ ప్రారంభించగా.. మహాత్మాజ్యోతిబా పూలే గురుకులాల శ్రీసత్యసాయి జిల్లా కన్వీనర్ వ్యవహారశైలిని సభ్యులందరూ తప్పుబట్టారు. అమ్మానాన్నలను కోల్పోయిన పిల్లలకు మానవతా దృక్పథంతో గురుకులాల్లో సీట్లు ఇమ్మని అడిగితే కన్వీనర్ స్పందించకపోగా ప్రజాప్రతినిధులతో వ్యంగ్యంగా, దురుసుగా మాట్లాడుతున్నారని ముక్తకంఠంగా ధ్వజమెత్తారు. రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు సీట్లు అమ్ముకోవడం దుర్మార్గమని జెడ్పీటీసీ సభ్యులు చంద్రకుమార్(అనంతపురం రూరల్), రాధ(కదిరి), అశ్విని(కూడేరు), మమత(బెళుగుప్ప), భాస్కర్(బుక్కరాయసముద్రం), మహేశ్(గుమ్మఘట్ట) తదితరులు మండిపడ్డారు. సీట్ల గురించి అడిగితే మీ జిల్లా వేరు.. మా జిల్లా వేరంటూ మాట్లాడుతున్నారని, ప్రాంతాల వారీగా విభజించి మాట్లాడితే ఊరుకునేది లేదని తేల్చిచెప్పారు. అయితే సమాధానం చెప్పాల్సిన కన్వీనర్, డీసీఓ ఇద్దరూ రాకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే వైవీఆర్, కలెక్టర్ గౌతమి



లబ్ధిదారుకు ధ్రువీకరణ పత్రం ఇస్తున్న కలెక్టర్ గౌతమి, ఎమ్మెల్యే వైవీఆర్

పామిడి: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమ ఫలాలు దక్కుతున్నాయని గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి, కలెక్టర్ గౌతమి అన్నారు. అర్హులు ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే వారిని గుర్తించి సంక్షేమ పథకాల లబ్ధి చేకూర్చేందుకు ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. పామిడి మండలం జి.కొట్టాలలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై, మాట్లాడారు. జగనన్న సురక్ష కార్యక్రమం కింద ఎలాంటి రుసుం తీసుకోకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ 11 రకాల సేవలను ప్రభుత్వం అందజేస్తోందన్నారు. ఇప్పటి వరకూ జిల్లా వ్యాప్తంగా 1.57 లక్షల మందికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందజేసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఎమ్మెల్యే వైవీఆర్ వివరించారు. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం జగన్‌కు ప్రజలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. అనంతరం జి.కొట్టాల సచివాలయ పరిధిలో మంజూరైన 397 ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్‌పర్సన్ ఎం.లిఖిత, జెడ్పీటీసీ సభ్యురాలు శోభారాణి, ఆర్డీఓ రవీంద్ర, మండల స్పెషలాఫీసర్ అప్పాజీ, తహసీల్దార్ ఆర్‌వీ సునీతబాయి, సర్పంచ్ పెరమసాని లక్ష్మమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు చుక్కలూరు దిలీప్‌రెడ్డి, జానకీరామిరెడ్డి, కె.నారాయణరెడ్డి, పెమ్మక చెన్నకేశవరెడ్డి, మూలి నాగేశ్వరరెడ్డి, ఎం.కుమార్‌రెడ్డి, పార్వతీశ్వర్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, జయరామిరెడ్డి, నక్కా ఓబులేసు, నగేష్‌యాదవ్, నెల్లి హనుమంతరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ భారతికి ఆర్థిక సాయం



సాయమందిస్తున్న తరిమెల రమణారెడ్డి

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం కల్చరల్: నిరుపేద కుటుంబంలో జన్మించినా ఆత్మవిశ్వాసంతో డాక్టరేట్ పట్టా అందుకున్న శింగనమల మండలం, నాగులగడ్డం గ్రామానికి చెందిన సాకే భారతికి అమ్మ సంస్థ ఆర్థిక సాయమందించింది. 'ఈమె డాక్టర్ భారతి.. ఎందరికో స్ఫూర్తి' శీర్షికతో బుధవారం 'సాక్షి'లో వెలువడిన కథనంపై అమ్మ సంస్థ తరిమెల రమణారెడ్డి స్పందించారు. బుధవారం నాగులగుడ్డం చేరుకుని భారతి, ఆమె కుటుంబసభ్యులను కలసి అభినందించారు. రూ.18 వేలు ఆర్థిక సాయం, నూతన వస్త్రాలు, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్తులోనూ ఆమెకు అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు.

భారతికి పలువురి అభినందన

శింగనమల: నాగులగుడ్డం గ్రామానికి చెందిన సాకే భారతి డాక్టరేట్ పట్టా పొందడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. 'ఈమె డాక్టర్ భారతి...ఎందరికో స్ఫూర్తి' శీర్షికన బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై నాగులగుడ్డం గ్రామానికి ఎరికల సంఘం నాయకులు స్పందించారు. బుధవారం ఉదయం సాకే భారతి కుటుంబసభ్యులను ఘనంగా సన్మానించారు. ఆర్థిక సాయం అందజేసి, అండగా ఉంటామని ఎరికల సంఘం నాయకులు గంపన్న, ఉమామహేశ్వరి అన్నారు. అలాగే శింగనమల మార్కెట్ యార్డ్ వైస్ చైర్‌పర్సన్ మూడ గీత, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసులు, రామకృష్ణ, వివిధ రాజకీయ పార్టీల నాయకులు భారతిని సన్మానించి, అభినందించారు.

తప్పుల్లేని ఓటరు జాబితా సిద్ధం చేయండి : కలెక్టర్

అనంతపురం అర్బన్: ఓటరు జాబితా సవరణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించి తప్పులు లేని జాబితాను సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఎమ్.గౌతమి ఆదేశించారు. 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్ల వయసు నిండే వారిని ఓటరుగా నమోదు చేయాలన్నారు. ఈ నెల 21వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ-2024 కార్యక్రమంపై ఎన్నికల అధికారులు, సిబ్బందికి బుధవారం రెవెన్యూభవన్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఆగస్టు 21 వరకు నెల రోజుల పాటు ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ప్రత్యేక శ్రద్ధతో చేపట్టాలన్నారు. చనిపోయిన ఓటర్ల విషయంలో మరణ ధ్రువీకరణ పత్రాన్ని పొంది, కుటుంబ సభ్యుల సమ్మతితో తొలగించాలన్నారు. వలసదారుల వివరాలు సేకరించి స్థిర చిరునామా ఆధారంగా ఓటరుగా నమోదు చేయాలన్నారు. డీఆర్‌ఓ గాయత్రీదేవి, ఆర్‌డీఓలు మధుసూదన్, రవీంద్ర, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, హౌసింగ్ పీడీ కేశవనాయుడు, ఎన్నికల విభాగం డీటీ కనకరాజు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా 'రీ-సర్వే'

- సర్వేయర్లకు ఎస్‌డీసీ శంకరయ్య సూచన



సర్వేయర్లతో సమావేశమైన అధికారులు

అనంతపురం అర్బన్: జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం కింద చేపట్టిన రీ-సర్వే అత్యంత ప్రతిష్టాత్మకగా చేపట్టాలని సంబంధిత అధికారులకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎస్‌డీసీ) శంకరయ్య సూచించారు. జిల్లాలో సమగ్ర సర్వే ప్రక్రియ వేగవంతం చేసిన క్రమంలో రీ-సర్వే అంశంపై బుధవారం పెన్నార్ భవన్‌లోని సమావేశ మందిరంలో రీ-సర్వే డిప్యూటీ తహసీల్దార్లు, మండల సర్వేయర్లు, వీఆర్‌ఓలు, విలేజ్ సర్వేయర్లకు ఒక్క రోజు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. సర్వే తీరును సర్వే భూ రికార్డుల శాఖ సర్వే ఇన్‌స్పెక్టర్లు వివరించారు. సర్వే చేసే క్రమంలో పాటించాల్సిన విధానాలు, నిబంధనలు తెలిపారు. అనంతరం శంకరయ్య మాట్లాడుతూ... ప్రస్తుతం 199 గ్రామాల్లో రీ-సర్వే జరుగుతోందన్నారు. ఇందులో భాగస్వాములైన అధికారులందరూ రీ-సర్వేకు సంబంధించి ప్రతి అంశంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏ చిన్న పొరపాటు జరిగినా అది పెద్ద సమస్యగా మారుతుందని హెచ్చరించారు. ఏ స్థాయిలోనూ తప్పిదాలకు తావివ్వరాదన్నారు. సందేహాలు తలెత్తితే వెంటనే ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్లి నివృత్తి చేసుకోవాలన్నారు. సమావేశంలో రీ-సర్వే పర్యవేక్షణ తహసీల్దారు నీలకంఠారెడ్డి, జిల్లా సర్వే ఇన్‌స్పెక్టర్ గుప్త పాల్గొన్నారు.

ఈఎన్‌టీ విభాగానికి రూ.18 లక్షల పరికరం

అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఈఎన్‌టీ విభాగంలో కాక్లియర్ ఇంప్లాంటేషన్ శస్త్రచికిత్సకు ఉపయోగపడే ఆధునాతన మైక్రోస్కోప్ అందుబాటులోకి వచ్చింది. ఈ మేరకు సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్‌ఎస్ వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు. రూ.18 లక్షలు విలువ చేసే అధునాతన పరికరం సాయంతో చెవి శస్త్రచికిత్సలు సులువుగా చేయవచ్చునన్నారు. ఈ మైక్రోస్కోప్ ద్వారా శస్త్రచికిత్సలు చేసే విధానంపై పీజీ విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. త్వరలో ఈ మైక్రోస్కోప్‌ను వినియోగంలోకి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు.

గాడిదలకు పెళ్లి..



గాడిదలకు పెళ్లి చేస్తున్న దృశ్యం

ఈ ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటి దాకా బలమైన వర్షాలు కురవ లేదు.. చినుకు పడితే గానీ.. రైతులకు పని ఉండదు. అందుకే.. వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుకుంటూ శెట్టూరు మండలం చింతర్లపల్లిలో ఇటీవల గాడిదలకు పెళ్లి జరిపించారు. ఇలా చేస్తే వర్షం పడుతుందని గ్రామీణుల విశ్వాసం. దీంతో ఈ వేడుకను ఊరంతా కలిసి సందడిగా నిర్వహించారు. అనంతరం వాటిని గ్రామంలో తప్పెట్లతో ఊరేగించారు.

-కళ్యాణదుర్గం

కౌకుంట్ల పంచాయతీ అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

- ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌కు మాజీ ఎమ్మెల్యే విశ్వ సవాల్




మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ: ఏనాడూ తన సొంత గ్రామ పంచాయతీ అభివృద్ధిని పట్టించుకోని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్... హైదరాబాద్, విజయవాడలో ఉంటూ పబ్లిసిటీ కోసం ప్రెస్‌మీట్‌ల ద్వారా తన ఉనికిని చాటుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ ఉరవకొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి మండిపడ్డారు. కౌకుంట్లలో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. అభివృద్ధిలో పెద్దకౌకుంట్ల పంచాయతీ వెనుకబాటుకు కేశవ్‌నే కారణమన్నారు. ప్రజల కనీస అవసరాలు సైతం తీర్చ లేకపోయారన్నారు. గ్రామంలో మౌలిక వసతులు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యాడన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మూడేళ్ల వ్యవధిలోనే రూ.54 కోట్ల నిధులతో కౌకుంట్లలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. పార్టీలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి జగన్ సర్కార్ కృషి చేస్తోందన్నారు. టీడీపీ హయాంలో కౌకుంట్ల పంచాయతీలో ఎంత మందికి ఇంటి స్థలాలు ఇచ్చి, పక్కా గృహాలు నిర్మించి ఇచ్చారో కేశవ్ తెలపాలన్నారు. దమ్ముంటే పంచాయతీ అభివృద్ధిపై చర్చకు రావాలంటూ సవాలు విసిరారు.

అదృశ్యమైన యువకుడి మృతి

- అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు



చరణ్ (ఫైల్)

కంబదూరు: మూడు నెలల క్రితం అదృశ్యమైన చరణ్(18) మృతి చెందినట్లుగా పోలీసులు నిర్ధారించారు. ఈ మేరకు అస్థికలను స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు తరలించారు. వివరాలను కళ్యాణదుర్గం సీఐ తేజమూర్తి, ఎస్‌ఐ రాజేష్ వెల్లడించారు. కంబదూరు మండలం పి.వెంకటాంపల్లికి చెందిన గోవిందప్ప, గంగరత్నమ్మ దంపతుల రెండో కుమారుడు చరణ్ మూడు నెలల క్రితం పని కోసం అనంతపురానికి వెళ్లాడు. అప్పటి నుంచి కనిపించకుండా పోయాడు. కుమారుడి ఆచూకీ కోసం తల్లిదండ్రులు గాలించినా ఫలితం లేకపోయింది. దీంతో ఎక్కడో ఓ చోట పనిచేసుకుంటూ జీవిస్తుంటాడని అనుకున్నారు. అయితే బుధవారం పి.వెంకటాంపల్లి సమీపంలోని అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరి వేసుకున్న రీతిలో వేలాడుతున్న ఓ మృతదేహం ఆనవాళ్లను గొర్రెల కాపరులు గుర్తించి, సమాచారం అందించడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. అదే సమయంలో గ్రామస్తులతో పాటు అక్కడికి చేరుకున్న చరణ్ కుటుంబసభ్యులు సంఘటనా స్థలంలో లభించిన సెల్‌ఫోన్, దుస్తుల ఆధారంగా మృతుడిని చరణ్‌గా గుర్తించి కన్నీరుమున్నీరుగా విలపించారు. చరణ్ మృతదేహం పూర్తిగా శిథిలమై అస్థికలు మాత్రమే మిగిలాయి. ఘటనకు సంబంధించి తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయడంతో ఆ దిశగా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

విధులు నిర్లక్ష్యం చేస్తే చర్యలు

- ఎంఈఓలకు ఆర్జేడీ వెంకటకృష్ణారెడ్డి హెచ్చరిక
- జాబ్‌చార్ట్ కచ్చితంగా అమలు చేయాలని ఆదేశం
- రోజూ లెసన్ ప్లాన్ తప్పనిసరని సూచన



మాట్లాడుతున్న ఆర్జేడీ వెంకటకృష్ణారెడ్డి

రాప్తాడురూరల్: క్షేత్ర స్థాయిలో విధులు సక్రమంగా నిర్వర్తించకపోతే ఇంటికెళ్లాల్సి ఉంటుందని మండల విద్యాశాఖాధికారులను విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు (ఆర్జేడీ) వెంకట కృష్ణారెడ్డి హెచ్చరించారు. అనంతపురంలోని సైన్స్‌సెంటర్‌లో ఎంఈఓలు, మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లతో బుధవారం ఆయన సమావేశమై మాట్లాడారు. జాబ్‌చార్ట్ కచ్చితంగా అమలు చేయాలన్నారు. రోజూ ఒక స్కూల్ విజిట్ చేసేలా ప్రణాళిక తయారు చేసుకోవాలన్నారు. పాఠశాలకు వెళ్లగానే విద్యార్థుల అటెండెన్స్ పరిశీలించాలన్నారు. విద్యార్థులెవరైనా గైర్హాజరైంటే ఎన్ని రోజుల నుంచి పాఠశాలకు రాలేదో తెలుసుకుని తల్లిదండ్రులతో మాట్లాడాలన్నారు. విద్యార్థులందరూ యూనిఫాం, షూ ధరించే స్కూళ్లకు వచ్చేలా చూడాలన్నారు. 18 ఏళ్లలోపు పిల్లలందరూ బడుల్లో ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. టీచర్లు సైతం రోజూ లెసన్ ప్లాన్‌తోనే బడికి వచ్చేలా చూడాలన్నారు. ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రతి రోజూ వర్క్‌నోట్స్ ఇవ్వాలన్నారు.ఈ ప్రక్రియలన్నీ ఎంఈఓలు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. ఈ నెల 22వ తేదీకి సెమిస్టర్-2 పాఠ్య పుస్తకాలు విద్యార్థుల చేతుల్లో ఉండాలన్నారు. ఎఫ్ఏ-1 పరీక్షలను ప్రతి విద్యార్థీ ఇంగ్లిష్ మీడియంలోనే రాయాలన్నారు. ఉన్నత పాఠశాలల్లో ప్రతి సబ్జెక్టుకు టీచరు ఉండాలన్నారు. ఎక్కడైనా కొరత ఉండే సర్దుబాటు చేయాలన్నారు. ఇందుకు పూర్తి బాధ్యత డిప్యూటీ డీఈఓలదేనన్నారు. ఐఎఫ్‌పీ ప్యానెళ్లు కచ్చితంగా ప్రతి పాఠశాలలోనూ వినియోగించాలన్నారు. ఎక్కడైనా నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్, డిప్యూటీ డీఈఓలు పద్మప్రియ, శంకర ప్రసాద్, అసిస్టెంట్ డైరెక్టర్ కృష్ణయ్య పాల్గొన్నారు.

నీటి సంపులో పడి బాలిక మృతి



లాస్య మృతదేహం

గుంతకల్లు రూరల్: ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి ఓ బాలిక మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... స్థానిక దోనిముక్కల రోడ్డులోని ఇందిరమ్మ కాలనీలో నివాసముంటున్న ఈశ్వరప్ప, సావిత్రమ్మ దంపతులకు ఒక్కగానొక్క కుమార్తె లాస్య(9) ఉంది. మూడేళ్ల క్రితం భర్త ఈశ్వరప్ప మృతి చెందాడు. అప్పటి నుంచి సరస్వతి బేల్దారి పనులు చేస్తూ కుమార్తెను సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలో మూడో తరగతి చదివిస్తోంది. ప్రభుత్వం మంజూరు చేసిన స్థలంలో సొంతింటి నిర్మాణం చేపట్టిన సరస్వతి బుధవారం మధ్యాహ్నం పనుల్లో పూర్తిగా నిమగ్నమైపోయింది. ఆ తర్వాత కుమార్తె కనిపించకపోవడంతో చుట్టుపక్కల గాలిస్తూ తాను నిర్మాణం చేపట్టిన ఇంటి వెనుక ఉన్న సంప్ వద్దకెళ్లి పరిశీలించడంతో నీటిలో తేలుతున్న లాస్య మృతదేహం కనిపించింది. వెంటనే బాలికను గుంతకల్లు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే లాస్య మృతి చెందినట్లుగా వైద్యులు నిర్ధారించారు. ఘటనపై రూరల్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



నగదు అందజేస్తున్న నాయకులు

రాప్తాడు: మండల పరిధిలోని మరూరుకు చెందిన కంసల వెంకటేష్ రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద మృతుడి తల్లి శాంతమ్మకు బుధవారం జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి, వేల్ఫేర్ అసిస్టెంట్ నరసింహులు, పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మీ రూ.10 వేలు నగదును అందజేశారు.

బస్సు పాసులకు నగదు వితరణ

చెన్నేకొత్తపల్లి: మేడాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పేద విద్యార్థుల బస్సు పాసులకు రూ.12 వేలను వైఎస్సార్‌సీపీ నాయకులు బోగన్న గారి సూర్యనారాయణ వితరణ చేశారు. బుధవారం స్థానిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ మేరకు పాసులు అందజేశారు. సర్పంచ్ రామాంజినేయులు ధర్మవరం ఆర్టీసీ డిపో మేనేజర్ మోతీలాల్, వెంకటేశ్వర్లు, నాగార్జున రెడ్డి, వైవీఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వికసించిన బ్రహ్మ కమలం



రాప్తాడు: మండల పరిధిలోని ప్రసన్నాయపల్లి పంచాయతీలోని చిన్మయనగర్ సమీపంలోని ఆర్‌జేసీ కాలనీలో అన్నం శ్రీదేవి, అన్నం శ్రీనివాస్ దంపతులు నివాసం ఉంటున్నారు. వారి ఇంట్లో బుధవారం ఉదయం బ్రహ్మ కమలం పువ్వు వికసించింది. దీంతో స్థానిక మహిళలు ప్రత్యేక పూజలు చేశారు.

రైతు కుటుంబాన్ని ఆదుకోండి

కనగానపల్లి: అప్పుల బాధ ఆత్మహత్య చేసుకొన్న మహిళా రైతు శ్రావణి కుటుంబాన్ని ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని పాతపాళ్యంలో రెండు రోజుల క్రితం రైతు శ్రావణి ఆత్మహత్య చేసుకోగా బాధిత కుటుంబ సభ్యులను బుధవారం రైతు సంఘం నాయకులు పరామర్శించారు. జిల్లా కౌలు రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి కదిరప్ప, పలువురు మండల రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

సజావుగా వలంటీర్ల ఇంటర్వ్యూ



అభ్యర్థిని ఇంటర్వ్యూ చేస్తున్న అధికారులు

ఆత్మకూరు: మండలంలో ఖాళీగా ఉన్న గ్రామ వలంటర్ పోస్టులకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరిగాయి. ఎంపీడీఓ విజయ్ ప్రసాద్, తహసీల్దార్ షర్మిల అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించడంతో పాటు ప్రభుత్వ పథకాలపై పలు ప్రశ్నలు వేశారు. మండలంలోని సనప-3, తలుపూరు-1, తోపుదుర్తి -1 పోస్టులకు ఇంటర్వ్యూలను నిర్వహించారు.

పచ్చదనం ప్రతిబింబించాలి

అనంతపురం క్రైం: నగరంలో పచ్చదనం ప్రతిబింబించేలా చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మి, అదనపు కమిషనర్ రమణారెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం నగరంలోని రెండో రోడ్డు, రాంనగర్, తదితర ప్రాంతాల్లోని పార్కులు, బళ్లారి బైపాస్ సర్కిల్‌ను తనిఖీ చేశారు. చేపట్టాల్సిన పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఇప్పటికే రెండో రోడ్డు స్టడీ పార్క్‌లో రూ.45 లక్షలతో డిజిటల్ లైబ్రరీ ఏర్పాటుకు టెండర్లు పూర్తయినట్లు తెలిపారు. ఎస్ఈ సతీష్, డీఈ రాంప్రసాద్ రెడ్డి, తదితరులున్నారు.

వృద్ధురాలికి ఆసరాగా..

వలంటీర్లకు వందనం

రాప్తాడు: సంక్షేమ పథకాలకు అర్హులకు వర్తింపజేయడంలో వలంటీర్లు కీలకంగా పనిచేస్తున్నారు. రాప్తాడు మండలం ఎం.బండమీదపల్లికి చెందిన వృద్ధురాలు అంకె అక్కమ్మ బీపీ ఎక్కువై అపస్మారక స్థితిలోకి వెళ్లింది. వెంటనే వలంటీర్ మమత గ్రామస్తుల సహాయంతో 108 ద్వారా అనంతపురంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లింది. వైద్యం ప్రారంభించిన వైద్యులు ఆమె పరిస్థితి బాగానే ఉందని, కాకపోతే మెంటల్‌గా అప్‌సెట్ అయి ఏదేదో మాట్లాడుతుందని తెలిపారు. బెంగళూరులో చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ అక్కడే స్థిరపడిపోయిన ఇద్దరు కుమారులు తమ తల్లి అక్కమ్మను మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తీసుకెళ్లారు. అక్కడ ఆస్పత్రిలో ఉంచి మూడు నెలలుగా చికిత్స అందించగా ప్రస్తుతం కోలుకుంది. బెంగళూరులోని తమ నివాసంలో ఉంచుకుని వైద్యం చేయిస్తున్నారు. విషయం తెలుసుకున్న వలంటీర్ కందుకూరి మమత, తన భర్త కందుకూరి ముత్యాలప్ప సాయంతో మూడు నెలలుగా సొంత ఖర్చుతో ప్రతి నెలా బెంగళూరుకు వెళ్లి వృద్ధాప్య పింఛన్ అందజేస్తోంది.



అక్కమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ మమత

వలంటీర్ సేవలు భేష్



బీపీ ఎక్కువ కావడంతో తీవ్ర అనారోగ్యానికి గురయ్యాను. వలంటీర్ గ్రామస్తుల సాయంతో అనంతపురంలోని ప్రభుత్వా ఆస్పత్రిలో చేర్పించింది. మెరుగైన వైద్యం కోసం బెంగళూరులో చికిత్స పొందుతున్నాను. ప్రతి నెలా పింఛన్ వస్తున్నా వెళ్లలేని పరిస్థితి. అయితే వలంటీర్ మమత ఫోన్ చేసి వివరాలు తెలుసుకుంది. ప్రతి నెలా బెంగళూరుకు వచ్చి పింఛన్ అందిస్తోంది. మమత సేవలు మరువలేనివి.

– అంకె అక్కమ్మ, ఎం.బండమీదపల్లి

అంతా మా ఇష్టం!

- సర్వజనాస్పత్రిలో ఇష్టారాజ్యంగా ఎంఎన్ఓ విధుల కేటాయింపు
- 10 మందికే కోరుకున్న చోటుకు
- ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాధ్యతారాహిత్యం
- పట్టించుకోని ఉన్నతాధికారులు

అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో వివిధ విభాగాల్లో మేల్ నర్సింగ్ ఆర్డర్లీ (ఎంఎన్ఓ) విధుల కేటాయింపులు ఇష్టారాజ్యంగా సాగుతున్నాయి. ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ తనకు నచ్చిన వారిని నెలల తరబడి ఒకే వార్డులో కేటాయిస్తున్నట్లు తెలిసింది. దీంతో పలువురు ఎంఎన్ఓలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నెలా విధులు కేటాయించే రోస్టర్‌తో అధికారులను సైతం తప్పుదోవ పట్టిస్తున్నారు. ముందస్తుగా వివిధ విభాగాలకు ఎంఎన్ఓలను కేటాయిస్తున్నట్లు రోస్టర్ సిద్ధం చేసుకుని ఆర్ఎంఓతో సంతకాలు చేయించడం, అనంతరం వైట్ మార్కర్ ద్వారా తనకు అనుకూలంగా ఉన్న వారికి నచ్చిన ప్రాంతాల్లో కేటాయింపులు జరుపుతున్నారు. సర్వజనాస్పత్రిలో మొత్తం 38 మంది ఎంఎన్ఓలు విధులు నిర్వర్తిస్తున్నారు. మూడు షిఫ్టుల ప్రకారం వీరు విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. ఉదయం వేళ రోగులతో ఆస్పత్రి కిక్కిరిసిపోతుంది. వందల సంఖ్యలో రోగులను వార్డులకు, ఎక్స్‌రే, సిటీ, ఎంఆర్ఐ స్కాన్, టూడీ ఎకో, అల్ట్రాసౌండ్, ఆపరేషన్ థియేటర్లకు తీసుకెళ్లాల్సి ఉంటుంది. ఇటువంటి తరుణంలో ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు అనుకూలంగా ఉన్న 10 మంది వరకు ఎంఎన్ఓలను వారు కోరుకున్న వార్డులు, షిఫ్టులకు వేస్తున్నట్లు సమాచారం. దీంతో ఇతరులపై అదనపు భారం పడుతోంది.



ఆస్పత్రి వెనుక వైపు స్ట్రెచర్‌పై మందులను ఉంచి పక్కన సేద తీరుస్తున్న ఓ ఎంఎన్ఓ



ఎంఎన్ఓ రోస్టర్‌ను మార్కర్ ద్వారా దిద్దిన దృశ్యం

నెలల తరబడి తిష్ట..

అత్యంత కీలకమైన క్యాజువాలిటీ (ఎమర్జెన్సీ)లో ఓ ఎంఎన్ఓ 8 నెలలు, మరో ఎంఎన్ఓ 3 నెలలకు పైగా విధులు నిర్వర్తిస్తున్నట్లు సమాచారం. ఆర్థో వార్డులో ఇద్దరిని నెలలు తరబడి, సర్జికల్ వార్డులో ఓ ఎంఎన్ఓను ఏళ్ల తరబడి, ఐదుగురు ఎంఎన్ఓలకు కేవలం సాయంత్రం షిఫ్టుల్లో మాత్రమే విధులకు వేస్తున్నారు. దీని వెనుక మతలబేమిటో అర్థం కావడం లేదు. నిబంధనల ప్రకారం ఎంఎన్ఓలను వివిధ వార్డులకు తరచూ మారిస్తే రోగులకందే సేవల్లో ఎటువంటి జాప్యం ఉండదు. ఎవరి పని వారు చేసుకుంటూ వెళ్లేందుకు అవకాశం ఉంటుంది. సర్వజనాస్పత్రిలో రెసిడెన్షియల్ మెడికల్ ఆఫీసర్లు రౌండ్ ద క్లాక్ అందుబాటులో ఉంటూ ప్రతి వార్డులో సిబ్బంది విధులు, తదితర వాటిపై నిశితంగా పరిశీలించాలి. అటువంటిది ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ అడ్డదారిలో పదుల సంఖ్యలో ఎంఎన్ఓలకు విధులను కేటాయిస్తుండడం విస్మయానికి గురి చేస్తోంది. ఇదే విషయమై ఇన్‌చార్జ్ ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ మాట్లాడుతూ రోస్టర్‌ను పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సెల్ఫ్ డ్రాయింగ్ పవర్ కల్పించాలి

- ఆర్జేడీకి ఎస్సీ–ఎస్టీ హెచ్ఎం, ఎంఈఓల సంఘం విన్నవం



ఆర్జేడీ వెంకట కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రాప్తాడురూరల్: మండల విద్యాశాఖ అధికారులకు సెల్ఫ్ డ్రాయింగ్ పవర్ కల్పించేలా చూడాలని ఎస్సీ, ఎస్టీ హెచ్ఎం–ఎంఈఓల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం అనంతపురంలోని సైన్స్ సెంటర్‌లో విద్యాశాఖ ఆర్జేడీ వెంకటకృష్ణారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ ఎంఈఓ–2కు జాబ్‌చార్ట్ ఇవ్వాలన్నారు. జీతాలు చెల్లించే అంశాన్ని పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. కొత్తగా నియమించిన హెచ్ఎం పోస్టులను డీడీఓ కోడ్, కేడర్ స్ట్రెంత్ అప్‌డేట్ చేయాలన్నారు. గతేడాది గ్రాంటు బకాయిలతో పాటు ఈ ఏడాదికి సంబంధించి ఎంఆర్‌సీ, సీఆర్‌సీ, పాఠశాల గ్రాంట్లు త్వరగా విడుదల చేయాలన్నారు. మనబడి నాడు–నేడు,జేవీకే పనుల్లో టెక్నికల్, ఇతర సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చూడాలన్నారు. ఆర్జేడీని కలిసిన వారిలో సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి గురుప్రసాద్, జిల్లా అధ్యక్షుడు చంద్రానాయక్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఓబుళపతి, భవాని శంకర్, జిల్లా ఉపాధ్యక్షులు తిప్పేస్వామి, ఆర్ఈఎఫ్ రామచంద్ర ఉన్నారు.

వారం రోజుల్లో మకాం మార్చాల్సిందే

అనంతపురం క్రైం: సర్వజనాస్పత్రికి వచ్చే రోగుల సౌకర్యార్థం వారం రోజుల్లో తోపుడుబండ్ల వ్యాపారులు మకాం మార్చాల్సిందేనని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ రమణారెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ప్రభుత్వ సర్వజనాస్పత్రి ముందు తోపుడు బండ్లను ఏర్పాటు చేశారు. దీంతో అదనపు కమిషనర్ రమణారెడ్డి, ఏసీపీ బాలాజీ, టూటౌన్ సీఐ శివరాముడు, ట్రాఫిక్ పోలీసులు తోపుడు బండ్లను తొలగించేందుకు వెళ్లారు. ఈ క్రమంలో అధికారులు, తోపుడు బండ్ల వ్యాపారుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. వ్యాపారులకు మద్దతుగా సీపీఎం నాయకులు రామిరెడ్డి, ఆర్‌వీ నాయుడు తదితరులు వచ్చి బైఠాయించారు. అదనపు కమిషనర్ రమణారెడ్డి మాట్లాడుతూ వ్యాపారాలు జరిగే సమయంలో ఏదైనా ప్రమాదం చోటు చేసుకుంటే రోగులకు ఇబ్బందులు కలిగే అవకాశం ఉంటుందన్నారు. 108 అంబులెన్స్‌లకు ఇబ్బంది కలిగే అవకాశం లేకపోలేదన్నారు. ముందు చూపుతో ఆలోచించి వ్యాపారాలు మరోచోట చేసుకోవాలని సూచించారు. రామ్‌నగర్ ఫ్లై ఓవర్ కింద వైపు వ్యాపారాలు చేసుకునేలా స్థలాన్ని కేటాయించడంతో పాటు ఐడీ కార్డులు మంజూరు చేస్తామన్నారు. ప్రజల కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



తోపుడు బండ్ల వ్యాపారులు, నాయకులతో మాట్లాడుతున్న ఏసీ రమణారెడ్డి

వారిని కఠినంగా శిక్షించాలి

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: తెలంగాణ రాష్ట్రంలో స్వతంత్ర మహిళా పాత్రికేయురాలిగా పనిచేస్తున్న తులసి చందును ఇబ్బందులకు గురిచేస్తున్న వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని మహిళా ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావును ఛాంబర్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర నాయకురాలు డాక్టర్ ప్రసూన, రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి మాట్లాడుతూ కొందరు అసాంఘిక శక్తులు పాత్రికేయురాలు తులసి చందుపై తప్పుడు ప్రచారాలు, ఆమె వ్యక్తిగత స్వేచ్ఛను హరించేలా, అశ్లీల వ్యాఖ్యలతో ఇబ్బందుల గురి చేస్తున్నారని తెలిపారు. ప్రశ్నించే వారందరినీ విద్రోహశక్తులుగా చిత్రీకరించే చర్యలు మానుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వరి, జిల్లా ఉపాధ్యక్షురాలు రామాంజినమ్మ, మహిళా సమాఖ్య నాయకులు లక్ష్మీదేవి, శ్వేత, సీఆర్ఎస్‌డీ నాయకులు సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీకి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

యాసిడ్ అక్రమ అమ్మకాలపై దాడులు

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: జిల్లా వ్యాప్తంగా యాసిడ్ అమ్మకాలు కొనసాగించే దుకాణాల్లో బుధవారం పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. అనంతపురం సబ్ డివిజన్ పరిధిలో ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు దుకాణాలు, రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు దుకాణాలు, నాల్గవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు దుకాణాలలో యాసిడ్ అమ్మకాలు జరుగుతున్నట్లు గుర్తించారు. అనంతపురం ఇన్‌చార్జ్ డీఎస్పీ వెంకట శివారెడ్డి పర్యవేక్షణలో సీఐలు రెడ్డప్ప, శివరాముడు, సీఐ ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బృందాలుగా విడిపోయి తనిఖీలు కొనసాగించారు. అమ్మకందార్ల లైసెన్సులు పరిశీలించారు. యాసిడ్‌ను ఎక్కడ నుంచి కొనుగోలు చేస్తున్నారు? ఏ పరిమాణంలో చేస్తున్నారన్న దానిపై ఆరా తీశారు. కొనుగోలుదారుల వివరాలను ఆరా తీశారు. యాసిడ్ అమ్మకాలలో అక్రమాలకు పాల్పడినా పరిమితికి మించి నిల్వ చేసినా, మైనర్లకు, యువకులకు విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని దుకాణాదారులకు హెచ్చరికలు జారీ చేశారు.

ముగిసిన క్రీడా పోటీలు

రాప్తాడురూరల్: అనంతపురం ఆదిమూర్తినగర్‌లోనని ఎస్ఆర్ఐ విద్యాసంస్థలలో నాలుగు రోజులుగా జరుగుతున్న క్రీడా పోటీలు బుధవారం ముగిశాయి. ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా పీవీకేకే విద్యాసంస్థల చైర్మన్ పల్లె కిశోర్ రెడ్డి, ఎస్ఆర్ఐ విద్యాసంస్థల చైర్మన్ వెన్నపూస విశ్వనాథరెడ్డి, ఎండీ చంటిరెడ్డి, ప్రముఖ సైకియాట్రిస్ట్ డాక్టర్ బాలాజీ హాజరయ్యారు. పల్లె కిశోర్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో విద్యార్థులు మొబైల్ ఫోన్లకు బానిసలై శారీరక ఆటలకు దూరమయ్యారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎస్ఆర్ఐ విద్యాసంస్థలు ఇంత పెద్ద ఎత్తున క్రీడలు నిర్వహించడం అభినందనీయమన్నారు. వెన్నపూస విశ్వనాథ రెడ్డి మాట్లాడుతూ ఒత్తిడి లేని విద్యావిధానమే తమ విధానం అన్నారు. డాక్టర్ బాలాజీ మాట్లాడుతూ క్రీడా పోటీల ద్వారా పిల్లలకు మానసిక ఉల్లాసం లభిస్తుందన్నారు. క్రీడల ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలి,శారీరకంగా యుక్తవయస్సులో ఎదగడానికి సాధ్యపడుతుందన్నారు. అనంతరం విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు దివ్యరెడ్డి, అనూషరెడ్డి, అకడమిక్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ వెంకటసుబ్బయ్య, షాహీన్, ఏఓ ప్రశాంత్ నాయక్, వైస్ ప్రిన్సిపాళ్లు శ్రీలత చౌదరి, శోభ, ఇంచార్జి అనిల్, రవీంద్ర పాల్గొన్నారు.



విజేతలను అభినందిస్తున్న అతిథులు

అనంతపురం జట్టు గెలుపు

అనంతపురం: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సౌత్ జోన్ ఇంటర్ డిస్ట్రిక్ట్ మల్టీ డే క్రికెట్ టోర్నీలో భాగంగా బుధవారం జరిగిన మ్యాచ్‌లో అనంతపురం జట్టు గెలుపొందింది. మొత్తం నాలుగు మ్యాచ్‌లు జరిగాయి. మొదటి మ్యాచ్‌లో కడప జట్టు మీద ఒక ఇన్నింగ్ తేడాతో గెలుపొందడంతో 3 పాయింట్లు, చిత్తూరు జట్టు మీద ఆధిక్యంతో 7 పాయింట్లు, నెల్లూరు జట్టు మీద ఆధిక్యంతో 1 పాయింట్, కర్నూలు జట్టుతో 3 పాయింట్లు ఆధిక్యంతో మొత్తం 14 పాయింట్లు సాధించి అనంతపురం జట్టు టోర్నీలో మొదటి స్థానం దక్కించుకుంది.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి



వివరాలు తెలుసుకుంటున్న స్పెషలాఫీసర్ శ్రీదేవి

బుక్కరాయసముద్రం: జగనన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని స్పెషలాఫీసర్ శ్రీదేవి లబ్ధిదారులకు సూచించారు. బుధవారం వడియంపేట, రెడ్డిపల్లి జగనన్న కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా స్పెషలాఫీసర్ మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించాలని హౌసింగ్ సిబ్బందికి సూచించారు. ఎంపీడీఓ విజయ భాస్కర్, ఈఆర్‌డీ దామోదరమ్మ, హౌసింగ్ ఏఈ రాజశేఖర్ రెడ్డి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

23న అఖండ నామ సంకీర్తన

అనంతపురం కల్చరల్: నగరంలో ఈనెల 23న జరగనున్న 12 గంటల నిర్విరామ అయ్యప్పస్వామి అఖండ నామసంకీర్తనలో అందరూ పాల్గొనాలని అఖిలభారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి రాష్ట్ర నాయకులు రంగాచారి, ప్రకాష్ ఆచారి పేర్కొన్నారు. బుధవారం స్థానిక రాణినగర్‌లోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో వారు మాట్లాడారు. లోక కల్యాణార్థం ఆదివారం గురుస్వాముల ఆత్మీయ సమ్మేళనంతో పాటు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ అఖండ అయ్యప్ప సంకీర్తనలను అయ్యప్ప దీక్షాపరులు ఆలపిస్తారన్నారు. కార్యక్రమానికి డాక్టర్ చంద్రమౌళి గురుస్వామి, బ్రహ్మంగారి మఠం ఈశ్వరీదేవి పీఠాధిపతులు శివస్వామీజీ, భవిష్యత్ మఠాధిపతులు వేంకటాద్రి స్వామి, అఖిల భారత దీక్షా ప్రచార సమితి జాతీయ వ్యవస్థాపకులు రాజుదేవ్ పాండే గురుస్వామి విశిష్ట అతిథులుగా విచ్చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గోపాల్, కేశవ, రమణ, అమర్, భజన్‌రాజ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రంగాచారి

మండలాభివృద్ధికి కృషి చేద్దాం

ఆత్మకూరు: మండలంలో ఏ సమస్య ఉన్నా ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించి మండలాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషిచేద్దామని ఎంపీపీ హేమలత తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజాసమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ హేమలత, ఎంపీడీఓ విజయ్ ప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల 22న జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించడానికి వస్తున్నారని తెలిపారు. గ్రామాలకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉన్నాయా ? అభివృద్ధి పనులు ఏవైనా జరగాల్సి ఉన్నాయా ? అని సర్పంచ్‌లు, ఎంపీటీసీల దగ్గర నుంచి అర్జీలను తీసుకున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్ నాయక్, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ నరసింహారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, కన్వీనర్ బాలపోతన్న, యూత్ కన్వీనర్ గూలి కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ హేమలత

గానంతో ఆకట్టుకున్న డీఈఓ

రాప్తాడురూరల్: జననీ జన్మభూమిశ్చా...స్వర్గాదపీ గరీయసీ అంటూ పాటను పాడి డీఈఓ ఎం. సాయిరామ్ ఆకట్టుకున్నారు. అనంతపురం నగర శివారులోని టీటీడీసీ శిక్షణ కేంద్రంలో జరుగుతున్న ఉన్నత పాఠశాలల హెచ్ఎంల శిక్షణలో రెండోరోజు బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పలువురు ప్రధానోపాధ్యాయులు ఉత్సాహంగా పాటలు పాడారు. జోక్స్, గజల్స్‌తో అలరించారు. చివరిగా డీఈఓ సాయిరామ్ గానంతో ఆకట్టుకున్నారు. జననీ జన్మభూమిశ్చా... మామా చందమామా ఎక్కడున్నావు...అంటూ పాడిన పాటలు అలరించాయి. పాటలు విన్న ప్రధానోపాధ్యాయులు జిల్లా విద్యాశాఖ అధికారిలో మంచి గాయకుడు ఉన్నాడంటూ చర్చించుకున్నారు.



పాటలు పాడుతన్న డీఈఓ సాయిరామ్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

రామగిరి: సంక్షేమ పథకాలు అర్హులకు చేరవేసే బాధ్యత, సచివాలయ సిబ్బంది, వలంటీర్లదేనని ఎంపీపీ కర్రెన్న, ఎంపీడీఓ అలివేలమ్మ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రమైన రామగిరి మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో వారు సమావేశమయ్యారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఇంకా అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించాలన్నారు. తహసీల్దార్ నారాయణ స్వామి, ఏఓ మురళీకృష్ణ, హౌసింగ్ ఏఈ విశ్వనాథ్ పాల్గొన్నారు.

వాన కురిసె.. మోము మురిసె



వానలో వాహనదారుల ఇక్కట్లు



జెడ్పీ కార్యాలయం సమీపంలో పడుతున్న వాన



గాలివానకు నిలవని గొడుగుతో ఇబ్బందులు..



చలికి వణుకుతూ...

చాలా రోజులుగా ఊరిస్తూ ఉసూరుమనిపించిన వరుణుడు బుధవారం కరుణించాడు. నగరవాసులను మురిపించాడు. బుధవారం ఉదయం నుంచి చిరుజల్లులు కురుస్తూనే ఉన్నాయి. సాయంత్రం కొద్దిసేపు జోరు వాన పడింది. దీంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. లోతట్టు ప్రాంతాల్లో రోడ్లపై నీళ్లు నిలిచాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం